ప్రకృతివనం అక్రమార్కుల పరం

- కలెక్టర్, తహసీల్దార్ ఆదేశాలు బుట్టదాఖలు
- అధికారులు ఎన్నికల నిర్వహణలో ఉండగా జోరందుకున్న అక్రమ నిర్మాణాలు
- సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల ఫిర్యాదులకు స్పందన కరువు


అక్రమార్కులు కబ్జా చేసి చదును చేస్తున్న పల్లె ప్రకృతి వనం స్థలం


వెంకటాపూర్ గ్రామంలో పల్లె ప్రకృతి వనం


జేసీబీతో తొలగించిన చెట్లు

మహబూబ్‌నగర్ రూరల్: అక్రమ దందాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన వెంకటాపూర్‌లో పల్లె ప్రకృతి వనానికి కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని కూడా మాయం చేసే ఘనులు ఉన్నారంటే అతిశయోక్తి లేదు. ఇప్పటికే ఇసుక మాఫియా వంటి కార్యకలాపాలకు అడ్డాగా మారిన వెంకటాపూర్‌లో ఇప్పుడు కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ భూములు, ఖాళీ జాగాలపై కన్నేశారు. గ్రామంలో 108 సర్వేనంబర్‌లో మొత్తం తొమ్మిది ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఇందులో కొంతభాగం గ్రామకంఠం, మరికొంత అసైన్డ్ భూమి, 40 మందికి గతంలో 120 గజాల చొప్పున ఇళ్ల నిర్మాణం కోసం స్థలాలను కేటాయించారు. అయితే ఇదే సర్వేనంబర్‌లో మిగిలిన భూమిని పల్లె ప్రకృతి వనం కోసం కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలకు ప్రాధాన్యత ఇచ్చి అందుకు స్థలాలను కేటాయిస్తే ఈ స్థలాలను కూడా కాజేసేందుకు అక్రమార్కులు దౌర్జన్యాలకు, భౌతిక దాడులకు దిగుతుండటం అధికార యంత్రాంగానికి, ముఖ్యంగా రెవెన్యూ అధికారులకు సవాల్‌గా మారింది. పల్లె ప్రకృతి వనం స్థలం జోలికి వస్తే సహించేది లేదని.. ఇదే చివరి అల్టిమేటం అని గత తహసీల్దార్ పాండు హెచ్చరికలు జారీ చేసినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేదు. పైగా కొత్తగా పల్లె ప్రకృతి వనం స్థలం 4 నుంచి 5 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. మహబూబ్‌నగర్ – కోయిలకొండ ప్రధాన రహదారిలో రోడ్డు పక్కన విలువైన స్థలం ఉన్నందున గ్రామంలోని కొంత మంది అక్రమార్కులు ఎవరికీ వారుగా కబ్జా చేసుకొని తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. రైతువేదిక ముందు పల్లె ప్రకృతి వనం బోర్డు ఉంది. అక్కడి సమీపంలో వనం చుట్టూ ఉన్న ఖాళీగా జాగాలపై ఎవరికీ వారుగా ఆక్రమణ చేసుకొని ఇళ్లు, షెడ్ల నిర్మాణాలు చేపడుతుండటం కనిపిస్తోంది. ఈ వ్యవహారంపై సర్పంచ్ మంగమ్మ ప్రజల తరపున తహసీల్దార్, కలెక్టర్‌లకు ఫిర్యాదు చేశారు. కానీ అధికారుల ఆదేశాలు ఇచ్చినా కూడా బుట్టదాఖలు అయ్యాయి. అధికారులు ఎన్నికల విధి నిర్వహణలో ఉండగా వెంకటాపూర్‌లో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. ఈ నిర్మాణాలు ఆపాలంటూ ప్రజలు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. అయితే మండల స్థాయి రెవెన్యూ అధికారుల పనితీరుపై కొంత అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది మధ్యవర్తులచే రెవెన్యూ సిబ్బందికి పెద్దఎత్తున మామూళ్లు ముట్టాయని తెలుస్తోంది. అందుకోసమే వారు పట్టించుకోవడం లేదనే చర్చ గ్రామంలో జోరుగా సాగుతోంది.

అక్రమార్కులపై చర్యలు



ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడితే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇక వెంకటాపూర్ గ్రామంలో 108 సర్వేనంబర్‌లో గల స్థలాలను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలకు పూనుకున్నారనే విషయంపై ఫిర్యాదు అందింది. అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా ఉన్నందున అక్రమ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించలేదు. ఇప్పుడు ఎన్నికలు అయిపోయాయి గనుక వెంకటాపూర్ గ్రామాన్ని సందర్శించిన పల్లె ప్రకృతి వనం స్థలంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. – సుందర్‌రాజ్, తహసీల్దార్, మహబూబ్‌నగర్ రూరల్

రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు



బాలానగర్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణకు కావాల్సిన చర్యలు పకడ్బందీగా చేపట్టాలని.. రైతులకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని మండల ప్రత్యేక అధికారి బాబురావు అన్నారు. గురువారం చిన్నరేవల్లి, మొదంపల్లి, ఏడుగుట్టల తండా, గుండేడ్ గ్రామాల్లో ఎంపీడీఓ కృష్ణారావుతో కలిసి పర్యటించిన ఆయన అక్కడి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించి తాళం ఎందుకు ఉందని ప్రశ్నించారు. నిత్యం అందుబాటులో ఉండాలని, సంబంధిత సిబ్బంది ఫోన్ నంబర్లతో కూడిన బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలను, నర్సరీలను పరిశీలించి సూచనలు చేశారు. మూడు రోజుల్లో మళ్లీ పర్యటిస్తానని అప్పటిలోగా పనులు పూర్తి కావాలని సూచించారు. ఆయన వెంట ఆయా గ్రామాల కార్యదర్శులు, సర్పంచ్‌లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

జడ్చర్ల: మండల పరిధిలోని గంగాపూర్ శివారులో ఓ వ్యక్తి బైక్‌ను ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో సదరు వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. బాధితుడిని తంగెళ్లపల్లికి చెందిన రాఘవేందర్‌గా గుర్తించారు. వెంటనే అతడిని వైద్య చికిత్స కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వాలి

గండేడ్: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వాలని మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బోయిని గోపాల్, ప్రధానకార్యదర్శి కేశవులు, పరిగి ముదిరాజ్ సంఘం సలహాదారులు ఏవీ రాములు, నర్సప్ప, గిరమోని శ్రీనివాస్‌లు తదితరులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఆయనకు కేబినేట్‌లో స్థానం కల్పించాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షుడు గిరమోని అంజిలయ్య, కొత్త గోపాల్, గిరమోని వెంకటయ్య, కోస్గి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై లిఖిత పూర్వక ఫిర్యాదు చేయండి

జడ్చర్ల టౌన్: కళాశాలలో, నివాసం ఉంటున్న ప్రాంతాల్లో, ఎక్కడైనా లైంగిక వేధింపులకు గురైతే వెంటనే లిఖిత పూర్వకంగా అంతర్గత కమిటీకి ఫిర్యాదు చేయాలని బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ సూచించారు. గురువారం లైంగిక వేధింపుల నిరోధక చట్టం గురించి మినిస్ట్రీ ఆఫ్ యూత్‌అఫైర్స్ అండర్ స్పోర్ట్స్ ఆదేశానుసారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా.నందకిశోర్, డా.సదాశివయ్య, డా. రమాదేవి, సుభాషిణీ, ఐసీసీ కన్వీనర్ డా.కే మంజుల పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘనంగా సన్మానం



అడ్డాకుల/దేవరకద్ర: ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని అడ్డాకుల మండల నాయకులు గురువారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల అధ్యక్షుడు తోట శ్రీహరి, నాయకులు ఖాజామైనోద్దీన్, దేవేందర్‌రెడ్డి, బుచ్చన్నగౌడ్, నిరంజన్, రాములు, నవీన్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా వివిధ మండలాల నుంచి వెళ్లిన నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నర్సశ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌తో..



మహమ్మదాబాద్ : అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టనున్న వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌ను మహమ్మదాబాద్ మండలానికి చెందిన టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏ రాములు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యువజన కాంగ్రెస్ నాయకుడు పవన్, ఆయా మండలాల నాయకులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



అడ్డాకుల: మండలంలోని కాటవరం గ్రామానికి చెందిన అనిత అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందడంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.20వేలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును గురువారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు లబ్ధిదారురాలి భర్త రమేష్‌గౌడ్‌కు అందజేశారు. తిమ్మాయిపల్లి సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు రాజునాయక్, కొండన్న, శ్రీనివాస్‌గౌడ్, రాము తదితరులు ఉన్నారు.

అక్రమంగా చెట్ల నరికివేత



రాజాపూర్: ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని అమలు చేస్తూ ప్రతి గ్రామంలో విరివిగా మొక్కలు నాటి పెంచి పోషించాలని ఖచ్చితమైన ఆదేశాలు అమలు చేస్తుంటే.. మరోవైపు పెరిగిన చెట్లను కొందరు ఎలాంటి అనుమతులు లేకున్నా నరికేస్తున్నారు. పరిశ్రమల్లోని బాయిలర్లలో వాడేందుకు వీటిని ఉపయోగిస్తున్నారు. వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కుతూ పెద్దపెద్ద చెట్లను నరికి శివారుల్లో ఉన్న పరిశ్రమల్లో అక్రమం తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. చెట్లను నరకకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎన్నాళ్లీ ట్రాఫిక్ వెతలు


గురువారం రాత్రి సిగ్నల్‌గడ్డపై ట్రాఫిక్‌జాం

జడ్చర్ల టౌన్: సిగ్నల్‌గడ్డపై నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్‌జాంలో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ కష్టాలు ఎప్పుడు తీరుతాయో.. లేదోనని ఆవేదన చెందుతున్నారు. 167వ నంబరు జాతీయరహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఎల్‌ఐసీ కార్యాలయం నుంచి డిగ్రీ కళాశాల హాస్టల్ వరకు 750మీటర్ల మేర పనులు ఆలస్యంగా ప్రారంభించారు. దీనికితోడు రైల్వేలైన్‌పై బ్రిడ్జ్ ఇరుకుగా ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. రోజురోజుకు పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్లు విస్తరణ జరగకపోవటంతో సమస్య ఉత్పన్నం అవుతోంది. గురువారం రాత్రి సైతం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాల రాకపోకలు అడ్డదిడ్డంగా సాగిస్తుండటంతో తరచూ సమస్య ఏర్పడుతోంది. ఇంతకుముందు బ్రిడ్జ్‌కు రెండు వైపులా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసినప్పటికీ.. అవి ఏనాడో పాడైపోయాయి. బారికేడ్లు రాత్రిళ్లు కానరాకపోవటంతో వాహనదారులు వాటికి ఢీకొట్టి ప్రమాదాల బారిన పడ్డారు. పోలీసులు ఇప్పటికైనా మరోసారి బారికేడ్లు ఏర్పాటు చేసి అవి స్పష్టంగా కనిపించేలా లైటింగ్‌ఏర్పాటు చేస్తే సమస్య కొంత తీరుతుందని పలువురు కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ పనులతో నీటి సరఫరాకు ఆటంకం


పైప్‌లైన్‌లు పరిశీలిస్తున్న కమిషనర్

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సిగ్నల్‌గడ్డ వద్ద 167వ నెంబరు జాతీయ రహదారిపై రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతుండటంతో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడింది. రోడ్డు నిర్మాణంలో భాగంగా తాగునీటిపైప్‌లైన్‌లు తొలగించారు. దీంతో పట్టణంలో నీటి సరఫరాకు ఇబ్బంది ఏర్పడింది. అయితే పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తిచేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహమూద్‌షేక్ వెల్లడించారు. పనులను గురువారం ఆయన పరిశీలించారు. త్వరితగతిన పైప్‌లైన్ వేసి నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

ఉమామహేశ్వరస్వామి జాతర ప్రారంభం


ఉమామహేశ్వరస్వామి దేవస్థానం


శివలింగం


ధన్వాడ: మండలంలోని యంనోనిపల్లిలోని గుట్టపై వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవస్థాన జాతర ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు సర్పంచ్ భారతిసచిన్ తెలిపారు. ఈ జాతర ఉత్సవాలు సోమవారం నుంచి మూడురోజులపాటు కొనసాగనున్నాయి. ఉత్సవాలకు మండలంతోపాటు ఇతర మండలాల నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో రానున్నారు. 12న స్వామివారి జలాభిషేకం, మంగళగౌరి బోనాలు, అగ్నిగుండం, అన్నదానం, రెట్టపట్ల కార్యక్రమాలు, 13న స్వామివారి ఊరేగింపు పల్లకిసేవ నిర్వహించి జాతర ఉత్సవాలను ముగించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాల్సిందిగా దేవస్థాన కమిటీ సభ్యులు కోరారు.

చెత్త కాల్చివేతతో ముప్పు


కాలుతున్న చెత్త

ధన్వాడ: చెత్తను కాల్చివేయకుండా ప్రతి ఇంటికి సేకరించి వ్యర్థ పదార్థాలను వేరు చేసి రీసైక్లింగ్ చేయాల్సి ఉండగా కొన్ని గ్రామాల్లో వాటిని కాల్చివేసి పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నారు. మండలంలోని యంనోనిపల్లి గ్రామ శివారులో ఉన్న డంపింగ్ యార్డులో చెత్తను తగులబెడుతున్నారు. ప్రభుత్వం ప్రతి గ్రామంలో రూ.లక్షలు వెచ్చించి డంపింగ్ యార్డులను నిర్మించి గ్రామంలో సేకరించిన చెత్తలో అవసరం ఉన్న మిగతా వాటిని ఎరువుల తయారీకి ఉపయోగించాల్సి ఉంది. అలా తయారు చేసిన కంపోస్ట్‌ను రైతులకు అమ్మివచ్చిన డబ్బులను గ్రామ పంచాయతీ అవసరాలకు ఉపయోగించాలి. కానీ, ఇక్కడ మాత్రం దానికి విరుద్ధంగా కొన్ని గ్రామాల్లో సేకరించిన చెత్తను తగులబెడుతున్నారు. దీంతో పర్యావరణానికి ముప్పుగా మారుతుందని గ్రామస్తులు వాపోతున్నారు.

శిథిలావస్థలో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు



బాలానగర్: మండల పరిధిలోని ఉడిత్యాల గ్రామంలో ఉన్న ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. దీంతో అది ఎప్పుడు కూలుతుందో అని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకు పక్కనే ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఉన్నాయి. దీంతో విద్యార్థుల తల్లి తండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. అనుకోని ఘటనలు చోటుచేసుకోకముందే శిథిలావస్థకు ట్యాంకుకు మరమ్మతు చేయడం లేదా తొలగించడం చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



అడ్డాకుల: మండలంలోని కాటవరం గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. వ్యవసాయ పొలంలో ఉన్న ఈ స్తంభం రోడ్డు వైపు ఒరిగి ఉంది. దీంతో అది ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి కూతవేటు దూరంలోనే అడ్డాకుల విద్యుత్ సబ్ స్టేషన్ ఉంది. ఈ స్తంభం మూలంగా ఎలాంటి ప్రమాదం సంభవించక ముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు


జిల్లాకేంద్రంలో అన్నదానం చేస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్: తెలంగాణ ముఖ్యమంత్రిగా పాలమూరు బిడ్డ, మిడ్జిల్ జెడ్పీటీసీగా రాజకీయం ప్రారంభించిన రేవంత్‌రెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేయడంతో జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మిడ్జిల్‌లో నాయకులు టపాసులు కాల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీ రబ్బానీ, పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డిపాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో అన్నదాన కార్యక్రమం

రేవంత్‌రెడ్డి ప్రమాణాస్వీకారం చేసిన సందర్భంగా, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేగా గెలుపొందడంపై జిల్లా కేంద్రంలోని స్టేషన్ చౌరస్తాలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మహాదేవప్ప, పులిజాల రవికిరణ్, పస్పుల రాజు, గోపాలకృష్ణ, రామకృష్ణ, రాజలింగం, రఘు, రాజశేఖర్, దినేష్, జహంగీర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనల వెల్లువ

సీఎంగా ప్రమాణ స్వీకరణ చేసిన రేవంత్‌రెడ్డికి పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు నారాయణగౌడ్, రఘురాంరెడ్డిలు అభినందనలు తెలిపారు. కొత్త ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని, ఉపాధ్యాయుల, ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేరాలన్నారు. సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు గట్టు వెంకట్‌రెడ్డిపై దాడులు చేయడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు.


మిడ్జిల్‌లో నాయకుల సంబురాలు

రేవంత్‌రెడ్డికి ప్రగతిశీల సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు సునీల్‌కుష్వాహా, రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్‌ఖాదర్ శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలల ఆవరణ శుభ్రంగా ఉంచుకోవాలి


మల్కాపూర్‌లో పాఠశాలలో తాగునీటి పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయరాములు

కోయిల్‌కొండ: పాఠశాలల ఆవరణలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. మండలంలోని మల్కాపూర్ ఉన్నతపాఠశాలను ఆయన సందర్శించారు. తాగునీటి ట్యాంకు తదితరాలను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. అనంతరం రాంపూర్‌లో నర్సరీని పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్వాహకులను కోరారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థులు


పోటీలకు ఎంపికైన కోడ్గల్ విద్యార్థులు

జడ్చర్ల/జడ్చర్ల టౌన్: హ్యాండ్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు కోడ్గల్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారని పీఈటీ శంకర్‌నాయక్ తెలిపారు. ఈనెల 6న జిల్లా గద్వాలలో ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా క్రీడల్లో అండర్–14 బాలికల విభాగంలో రజిత, హరిత, అనూష, బాలుర విభాగంలో సిద్దు, అరవింద్, అరుణ్, తరుణ్, నవీన్ సత్తాచాటారని వివరించారు. ఈనెల 8 నుంచి మంచిర్యాల జిల్లా భీమవరంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని వివరించారు. హెచ్‌ఎం శ్రీనివాసులు విద్యార్థులను అభినందించారు.

నవాబుపేటకేజీబీవీ నుంచి..

నవాబుపేట: హ్యాండ్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మాధవి తెలిపారు.విద్యార్థులు కావ్య, సావిత్రిలను పీఈటీ అర్చన, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

బాస్కెట్ బాల్ పోటీలకు..హైదరాబాద్‌లో శుక్రవారం నుంచి జరిగే ఎస్‌జీఎఫ్ అండర్ 14 బాస్కెట్‌బాల్ పోటీలకు పట్టణంలోని ప్రేరణ పాఠశాల విద్యార్థి స్ఫూర్తి ఎంపికైనట్లు హెచ్‌ఎం గోపీనాథ్ తెలిపారు.


నవాబుపేట కేజీబీవీ విద్యార్థులు


బాస్కెట్‌బాల్ టోర్నీకి ఎంపికైన స్ఫూర్తి